
సాక్షి
బాపట్ల

గురువారం । 25 । మే । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 520.70 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.70 అడుగుల వద్ద ఉంది.



నిమ్మకాయల ధరలు

తెనాలి : గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1300, గరిష్ట ధర రూ.2,500, మోడల్ ధర రూ.1,800 వరకు పలికింది.

హజ్ యాత్రికులకు టీకాలు తప్పనిసరి



గుంటూరు మెడికల్: హజ్ యాత్రికులు తప్పనిసరిగా వ్యాధినిరోధక టీకాలు వేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. వివరాల కోసం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కె.వి.సుబ్బరాజును 9848686364 సంప్రదించాలని పేర్కొన్నారు.

పేదలు హాయిగా బతకాలనీ

- వరమిచ్చిన సీఎం వైఎస్ జగన్
- నెరవేరిన సొంతింటి కల
- ఇళ్ల నిర్మాణాలు వేగవంతం
- 3,009 గృహాలతో పెద్ద ఊరుగా మారనున్న జగనన్న కాలనీ
- 845 గృహ నిర్మాణాలు పూర్తి
- వివిధ దశల్లో 830 గృహాలు



'నిర్మాణా'త్మక ప్రగతి : జగనన్న కాలనీలో జరుగుతున్న గృహ నిర్మాణాలు

రేపల్లె: ప్రతి పేదా హాయిగా బతకాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం నెరవేరుతోంది. పేదల సొంతింటి కల తీరుతోంది. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు కృషితో రేపల్లె పట్టణంలో మరో పెద్ద ఊరు జగనన్న కాలనీ రూపంలో ఆవిర్భవించబోతోంది. ఇప్పటికే ఈ కాలనీలో 845 గృహాల నిర్మాణం పూర్తయింది. మరో 830 వివిధ దశల్లో ఉన్నాయి. మొత్తం ఇక్కడ 3,009 మందికి ప్లాట్లు ఇచ్చారు.

63 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో..

రేపల్లె పట్టణంలోని 17వ వార్డులో 63 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో జగనన్న కాలనీ లేఅవుట్ వెలిసింది. టౌన్‌ప్లానింగ్ నిబంధనల ప్రకారం.. ఇక్కడ వెడల్పయిన రోడ్లు నిర్మించారు. 3,009 ప్లాట్లు వేసి పేదలకు నివేశన స్థలాలు అందించారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేశారు. దీనిలో భాగంగా ఇప్పటికే 845 గృహాల నిర్మాణాలు పూర్తి చేశారు. 830 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. ఇంకా నిర్మాణాలు చేపట్టని 1,334 మంది కూడా ఇళ్లు నిర్మించుకునేలా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధమయ్యారు.



సుఖీనో 'భవంతి': జగనన్న కాలనీలో పూర్తయిన భవనం

ప్రత్యేక ప్రణాళికలు

నివేశనా స్థలం పొందిన ప్రతిఒక్కరూ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకునేలా అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. పట్టణంలోని 14 సచివాలయాల పరిధిలో ఏడుగురు నోడల్ ఆఫీసర్లను నియమించి లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారు. కౌన్సిలర్లు, గృహ నిర్మాణ శాఖాధికారులు, సచివాలయ సిబ్బంది, మెప్మా అధికారులతో నిరంతరం నిర్మాణాల పురోగతిని పర్యవేక్షిస్తున్నారు. సొంతంగా ఇళ్లు నిర్మించుకునే స్తోమత లేని వారికి గృహాలు కట్టించి ఇచ్చేందు స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వస్తున్నాయి. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఊహించని వరం



సొంత ఇంటి కల నెరవేరుతుందని ఊహించలేదు. గతంలో ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా వాగ్దానాలు చేయటం అధికారం చేపట్టగానే వాటిని మరిచిపోవటమే చూశాం. ఎన్నికల సమయంలో జగనన్న ప్రజలకు ఇచ్చిన హామీలను నూటికి నూరుశాతం నెరవేర్చారు. మా సొంత ఇంటి కల తీర్చారు. ఆయన రుణం తీర్చుకోలేం. ఇల్లు సమకూరుతుండడం చాలా ఆనందంగా ఉంది. ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు.

– కర్రా లోకేశ్వరరావు, 11వవార్డు, రేపల్లె టౌన్

ఆనందంగా ఉంది



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా కల నెరవేర్చారు. టైలరింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. మాకు ఇల్లు సమకూరడం ఆనందంగా ఉంది. పేదల కష్టాలు తెలిసిన జగనన్న ముఖ్యమంత్రి కావటం మా అదృష్టం. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు తోడుగా నిలిచి ముఖ్యమంత్రిని చేసుకుంటాం. ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు చొరవ వల్ల వేగంగా ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ మేలును మరిచిపోలేం.

– బర్మా రాధ, 8వ వార్డు, రేపల్లె టౌన్

మోపిదేవి పర్యవేక్షణలో..



జగనన్న కాలనీ నిర్మాణాల గురించి రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణా రావు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారు. నీటి వసతి కల్పనకు 17 బోర్లు వేసి 133 ట్యాంకర్లను ఏర్పాటు చేయించాం. అప్రోచ్ రోడ్లు, విద్యుత్‌స్తంభాలు ఏర్పాటు చేశాం. 9 మీటర్ల వెడల్పుతో రోడ్లు నిర్మించాం. ఇంటి నిర్మాణాలను చేసుకోలేని వారికి అవగాహన కల్పించి, మెప్మా ద్వారా రుణాల మంజూరు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిర్మాణాల పూర్తికి కృషి చేస్తున్నాం.

– విజయసారథి, మున్సిపల్ కమిషనర్, రేపల్లె

జగనన్న విద్యాదీవెన వరం

- అట్టహాసంగా కార్యక్రమం
- నమూనా చెక్కు అందజేసిన కలెక్టర్ రంజిత్‌బాషా
- ఆనందం వ్యక్తం చేసిన లబ్ధిదారులు



జగనన్న విద్యాదీవెన చెక్కును అందిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్సీ పోతుల సునీత

బాపట్ల: జగనన్న విద్యా దీవెన ఓ వరమనీ, సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జగనన్న విద్యా దీవెన చెక్కు పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు కలెక్టర్ నమూనా చెక్కును అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ పథకం ద్వారా 22,246 మంది విద్యార్థులకు మేలు జరిగిందని, 19,944 మంది తల్లుల ఖాతాల్లో 21.88 కోట్ల రూపాయలు జమయ్యాయని వివరించారు. రాష్ట్రంలో పేదరికం వల్ల విద్యార్థుల చదువు మధ్యలో ఆగిపోకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విద్యా దీవెన కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం : ఎమ్మెల్సీ పోతుల సునీత

విద్య, వైద్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్సీ పోతుల సునీత కొనియాడారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు మనబడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల అభివృద్ధికి శ్రీకారం చుట్టారని వివరించారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజా దిబోరా, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ దస్తగిరి, రేపల్లె సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కట్టా సత్యనారాయణ, చీరాల సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి వై.యువ స్వరూప, విద్యార్థులు పాల్గొన్నారు.

అద్దంకిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

బాపట్ల: అద్దంకి నియోజకవర్గంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. అద్దంకి నియోజకవర్గ స్థాయి సమీక్ష బుధవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. అద్దంకి పట్టణంలో ఏఐబీ(ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్) ద్వారా చేపట్టిన తాగునీటి ప్రాజెక్టు నిర్మాణ పనులను అధికారులు తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. దీనికోసం రూ.82 కోట్ల మంజూరయ్యాయన్నారు. పట్టణ ప్రాంతంలో 12 కిలోమీటర్ల మేర పైపు లైన్ నిర్మాణం పూర్తయినా వివిధ పనులు మిగిలాయని పేర్కొన్నారు. అద్దంకిలో అమృత్ సరోవర్ ద్వారా మంజూరైన రూ.8 కోట్లతో చెరువులు అభివృద్ధి చేయాలన్నారు. పట్టణ శివారు ప్రాంతాలలో తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మాజీ శాసనసభ్యులు బాచిన చెంచుగరటయ్య కలెక్టర్ దృష్టికి తెచ్చారు. మంజూరైన వాటర్ గ్రిడ్ నిర్మాణానికి స్థలం కేటాయించి పనులు వేగంగా ప్రారంభించాలన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.వంద కోట్లు నిధులు మంజూరు కాగా పనులు సత్వరమే చేపట్టాలన్నారు.

శ్మశానాలకు భూమి కేటాయించండి

గ్రామీణ ప్రాంత ప్రజల కోసం శ్మశాన భూమి కేటాయించేలా అధికారులు తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. ఆర్ అండ్‌బీ రహదారుల విస్తరణ పనులు చేపట్టాలని, జగనన్న కాలనీలకు అప్రోచ్ రోడ్లను ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించాలని పేర్కొన్నారు. మనబడి నాడు-నేడు పాఠశాలల అభివృద్ధి పనులను జూన్ 12లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌పై ఆరా తీశారు. సమావేశంలో జేసీ శ్రీధర్, శాప్‌నెట్ చైర్మన్ బాచిన చైతన్య ప్రసాద్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఐసెట్

నరసరావుపేట ఈస్ట్: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఐసెట్ ప్రవేశ పరీక్ష బుధవారం ప్రశాంతంగా ముగిసింది. నరసరావుపేట కేంద్రంగా నాలుగు ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యార్థులు ఐసెట్‌కు హాజరయ్యారు. ఎంబీఏ, ఎంసీఏ పీజీ కోర్సులలో చేరేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఐసెట్ నిర్వహించారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో 440 మంది విద్యార్థులకు 403మంది, ఎస్‌ఐటీ కళాశాలలో 420 మందికి గాను 380, తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో 360 మందికి 338 మంది, కృష్ణవేణి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో 160 మందికి గాను 149 మంది హాజరయ్యారు.

టీచర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ వాయిదా

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ పాఠశాలల్లో విధులు నిర్వర్తించే అన్ని స్థాయిల ఉపాధ్యాయుల సర్వీసు క్రమబద్ధీకరణ, ప్రొబేషన్ డిక్లరేషన్ ఇప్పటి వరకు చేయించుకోని ఉపాధ్యాయుల సౌకర్యార్థం ఈనెల 30, 31 తేదీల్లో గుంటూరు డీఈఓ కార్యాలయంలో తలపెట్టిన కార్యక్రమం వాయిదా వేసినట్లు డీఈఓ పి.శైలజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బదిలీలు, పదోన్నతుల కారణంగా వాయిదా వేశామని, త్వరలో తదుపరి తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఏపీ పాలిసెట్-23 కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

క్రోసూరు: ఏపీ పాలిసెట్ –23 కౌన్సిలింగ్ వివరాల్ని బుధవారం ఎగ్జామ్స్ జిల్లా కో-ఆర్డినేటర్, క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.వి.రమాదేవి వివరించారు. మే 25 నుంచి జూన్ 10 వరకు కౌన్సెలింగ్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలన్నారు. ఇందుకు http://appolycet.nic.inను సందర్శించాలని సూచించారు. మే 29 నుంచి జూన్ 5 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్, జూన్ 1 నుంచి జూన్ 6 వరకు వెబ్ ఆప్షన్, జూన్ 7న మార్పులకు అవకాశం ఉందన్నారు. జూన్ 9న సీట్ల కేటాయింపు, జూన్ 15 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి గుంటూరులోని నల్లపాడు , ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పల్నాడు జిల్లాకు నరసారావుపేటలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీ, బాపట్ల జిల్లాకు బాపట్లలోని పాలిటెక్నిక్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని వెల్లడించారు. ఇతర వివరాలకు వెబ్‌సైట్ సందర్శించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ర్యాంకుల వారీగా సర్టిఫికెట్ల పరిశీలన తేదీలు

ఈనెల 29న 1 నుంచి 12,000
30న 12,001 నుంచి 27,000
31న 27,001 నుంచి 43,000
జూన్ 1న 43,001 నుంచి 59,000
జూన్ 2న 59,001 నుంచి 75,000
జూన్ 3న 75,001 నుంచి 92,000
జూన్ 4న 92,001 నుంచి 1,08,000
జూన్ 5న 1,08,001 నుంచి చివరి ర్యాంకు

మాతృమరణాల నివారణకు చర్యలు



నరసరావుపేట: జిల్లాలో మాతృమరణాలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి జి.శోభారాణి ఆదేశించారు. స్థానిక పల్నాడు రోడ్డులోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏప్రిల్‌లో జరిగిన మాతృమరణాలపై డాక్టర్లు, కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో ముత్తుకూరు పీహెచ్‌సీ దుర్గి మండల పరిధిలో జరిగిన మాతృ మరణంపై కమిటీ సభ్యులు, ప్రైవేటు, ప్రభుత్వ వైద్యాధికారుల సమక్షంలో మరణాలకు గల కారణాలను, వాటిని అధిగమించేందుకు భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ హాస్పిటళ్ల పర్యవేక్షణాధికారి డాక్టర్ బీవీ రంగారావు, డెప్యూటీ డీఎండీహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్, ప్రభుత్వ, ప్రైవేటు డాక్టర్లు మంత్రు నాయక్, పి.సింధుజ, వసంత రాయ్, నాగ పద్మజ, హనుమకుమార్, డీపీహెచ్ఎన్ఓ బి.సురేఖ, ఐసీడీఎస్ పీడీ అరుణ పాల్గొన్నారు.

సెలవుపై గుంటూరు కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి ఈనెల 24 నుంచి జూన్ 7 వరకు సెలవుపై వెళ్లనున్నారు. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శికి నగర కమిషనర్ సమాచారం అందించారు. గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి లేదా నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్దిరోజాను ఇన్‌చార్జిగా నియమించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

బహుముఖ ప్రజ్ఞాశాలి చంద్రమౌళి

- ఉత్తమ ఉపాధ్యాయుడిగా, రచయితగా, శాసన, తాళపత్ర గ్రంథ పరిశోధకుడిగా ఖ్యాతి
- ఇటీవలే ఆంధ్రకేసరి జీవిత సాఫల్య పురస్కారం
- పీహెచ్‌డీ విద్యార్థులకు ఉపయుక్తంగా చారిత్రక గ్రంథాలు
- ప్రస్తుతం అచ్చతెలుగు నిఘంటువు తయారీలో చంద్రమౌళి



అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి నుంచి పురస్కారం అందుకుంటున్న చంద్రమౌళి(ఫైల్)



తాళపత్ర గ్రంథాన్ని పరిశీలిస్తున్న చంద్రమౌళి

అద్దంకి: ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. విశ్రాంత ఉపాధ్యాయుడిగా, రచయితగా, శాసన, తాళపత్ర గ్రంథ పరిశోధకుడిగా నిరంతరం సేవ చేస్తూ సాహిత్య అభివృద్ధికి పాటు పడుతున్నాడు. జిల్లాలో ఎక్కడ శాసనం బయల్పడినా తాళపత్ర గ్రంథం లభించినా ఎవరైనా చంద్రమౌళి మాస్టారును పిలవాల్సిందే. ఈయన చదివింది తెలుగు, చేసింది తెలుగు పండిట్ ఉద్యోగం. అయితేనేం. ఉమ్మడి ప్రకాశం (బాపట్ల, ప్రకాశం) జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పర్యటించి, ఆయా ప్రాంతాలను ఏలిన రాజవంశాలు, బౌద్ధం, పురాతన సమాధులు, పురాతన శిల్పాల వంటి వాటిని గుర్తించి, ఆయా ప్రాంతాల చరిత్రకు గ్రంథ రూపం కల్పించారు.

అంతటితో ఊరుకోక తాళపత్ర గ్రంథాలు చదివి వాటికి శుద్ధప్రతులు తయారు చేయడం , రాజుల కాలం నాటి శాసనాలను చదివి వాటికి పుస్తక రూపం కల్పించమే కాకుండా పురావస్తు శాఖ వారికి తెలియజేసి మ్యూజియంలో స్థానం కల్పిస్తున్నారు విద్వాన్ జ్యోతి చంద్రమౌళి. బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని బొమ్మనంపాడు గ్రామానికి చెందిన జ్యోతి శ్రీరాములు, వెంకట సుబ్బమ్మ దంపతులకు 1950లో ఆయన జన్మించారు. తండ్రి శ్రీరాములు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, బుర్రకథకు మెరుగులు దిద్దారు. చిన్నతనం నుంచే సాహిత్యం పట్ల మక్కువ పెంచుకున్న చంద్రమౌళి స్వగ్రామంలో ప్రాథమిక విద్య, అద్దంకిలోని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పది, ఇంటర్ చదివారు. తరువాత 1969లో విద్వాన్ అభ్యసించి తొలుత 1974లో కొమరోలులో తెలుగు ఉపాధ్యాయుడిగా ప్రస్థానం ప్రారంభించారు. 2008లో తాళ్లూరులో ఉద్యోగ విరమణ చేశారు. కస్తూరి రంగాచారి వద్ద ఏడాదిపాటు పంచకావ్యాలు అభ్యసించారు.

కవితా వ్యాసంగం, పుస్తక రచన..

ఒకసారి పాఠశాలకు వచ్చిన అప్పటి డిప్యూటీ డీఈవో జిలానీ అద్దంకి చరిత్రపై వ్యాసం రాసి ఇవ్వమని కోరారు. ఆ వ్యాసం బాగుండడంతో పుస్తకంగా రాయమని సలహా ఇచ్చారు. ఆయన స్ఫూర్తితో పుస్తక రచన ప్రారంభించారు. ఇక ఆగకుండా 'సృజన ఖండకావ్యం, సూక్తి రత్నాలు, సూక్తి కిరణాలు, అద్దంకి చరిత్ర, ప్రకాశం జిల్లా దర్శనీయ స్థలాలు, మణికేశ్వరం చరిత్ర, దళిత కిరణాలు, ప్రకాశం జిల్లాలో జానపద కళలు, అద్దంకి సీమ చరిత్ర, సంస్కృతి, అద్దంకి దేవాలయాల చరిత్ర, కొణిదెన, తాళ్లూరు మండల ప్రాచీన వైభవం, కొండవీటి చరిత్ర, ప్రకాశం జిల్లాలో బౌద్ధం, ఆంధ్రాలో బౌద్ధం వంటి ఆరు చారిత్రక గ్రంథాలు, ఏడు పద్యకావ్యాలు, శతకాలతో కలుపుకుని మొత్తం 23 పుస్తకాలు రచించారు.

శాసన పరిశోధనకు అంకురార్పణ

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఎవరూ గుర్తించని 45 శాసనాలు వెలికి తీశారు చంద్రమౌళి. కొణిదెన, లక్కవరం, చందవరం, మణికేశ్వరం, అద్దంకి మండలంలోని బొమ్మనంపాడు, నాగులపాడు, శింగరకొండ, ధేనువకొండ, పేరాయిపాలెం, నన్నూరిపాడు, భైరవ కోన, ధర్మవరం , తదితర ప్రాంతాల్లో పర్యటించి పురాతన శాసనాలను, క్రీస్తు పూర్వం నాటివి వెలికితీశారు. ఇదంతా బూదరాజు రాధాకృష్ణ ఇచ్చిన తెలుగు లిపి పరిణామం కాగితాలు ఆయనకు బాగా ఉపకరించాయి. వాటి అభ్యాసంతోనే శాసనాలపై లిఖించిన లిపిని చదవడం, కాపీ చేయడం పుస్తక రూపం కల్పించి రాష్ట్రంలోనే శాసన పరిశోధనలో విశిష్ట వ్యక్తిగా గుర్తింపు వచ్చింది. అలాగే తాళ పత్ర గ్రంథాలను సేకరించి వాటిని శుభ్రపరచి శుద్ధప్రతులను తయారు చేశారు. అంతరించి పోతున్న కళారూపాలను బతికించడం కోసం 1998లో జానపద కళాపీఠం స్థాపించి, ప్రతి ఏడాది ఆయా కళారూపాల ప్రదర్శనతో కళాకారులను సన్మానిస్తూ ఇతోధికంగా సాయం అందిస్తున్నారు. ప్రకాశం జిల్లా రచయిత సంఘ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ జీవిత సభ్యుడిగా, ఇండియన్ ఎపిగ్రాఫీ సొసైటీ సభ్యుడిగా, ఎపిగ్రాఫీ సొసైటీ ఆఫ్ ఆంధ్రాకు జాయింట్ సెక్రటరీగా ఉన్నారు. పరిశోధన సంస్థను స్థాపించి అధ్యక్షుడిగా సేవలు అందిస్తున్నారు.

అందుకున్న సన్మానాలు, సత్కారాలు ఎన్నో..

2003లో తొలుత జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా, 2006లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా పురస్కారం, అధికార భాషా సంఘంచే పురస్కారం, గిడుగు రామమూర్తి పురస్కారం, 2010 జనవరి 26న కలెక్టర్ దేవానంద్‌చే అద్దంకి చరిత్రకు పురస్కారం, 2012లో ఉత్తమ కవిగా, ఉత్తమ పరిశోధకుడిగా, అప్పటి సీఎం వై.ఎస్.రాజశేఖరరెడ్డిచే పురస్కారం, అప్పటి మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డిచే పురస్కారం, జిల్లా విశిష్ట వ్యక్తిగా, ఉగాది పురస్కారం ఇలా వందకుపైగా పురస్కారాలు అందుకున్నారు. చారిత్రక రత్న, జానపద కళానిధి, సీ భారతీయడు, నాగభైరవ కోటేశ్వరరావుచే విద్వత్ కవి వంటి బిరుదులెన్నో పొందారు. వెండి మీసాల చంద్రుడిగా పిలవబడే జ్యోతి చంద్రమౌళి అద్దంకి వాడు కావడం గర్వకారణం . ఆయన రాసిన గ్రంథాలు చరిత్ర చదువుకునే విద్యార్థులకు ఉపయోగడటమే కాకుండా ఎనిమిది మంది పీహెచ్‌డీ చేయడానికి ఉపయోగపడ్డాయంటే ఆ గ్రంథాలు ఎంతటి విలువైనవో ఇట్టే చెప్పేయవచ్చు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ కిరణ్‌కుమార్



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ నీలం ప్రభావతిని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. డాక్టర్ కిరణ్‌కుమార్ ప్రస్తుతం జీజీహెచ్ జనరల్ సర్జరీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. గుంటూరు సంజీవయ్యనగర్‌కు చెందిన ఉపాధ్యాయులు ఏకుల రాజారావు, విజయలక్ష్మి దంపతుల తనయుడు డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ 1986లో గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్, 1991లో జనరల్ సర్జరీలో పీజీ వైద్య విద్య పూర్తి చేశారు. జిల్లాలోని గాదెవారిపల్లి, సంగం జాగర్లమూడిలో 1991 డిసెంబరులో మెడికల్ ఆఫీసర్‌గా విధుల్లో చేరి ప్రభుత్వ సర్వీసులోకి ప్రవేశించారు. గుంటూరు వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా 1994లో విధుల్లో చేరి 2004లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2012లో ప్రొఫెసర్‌గా పదోన్నతులు పొందారు. గతంలో విజయవాడ జీజీహెచ్, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన అనుభవం డాక్టర్ కిరణ్‌కుమార్‌కు ఉంది. జీజీహెచ్‌లో పలు అరుదైన శస్త్రచికిత్సలు చేశారు. డాక్టర్ కిరణ్‌కుమార్‌ను సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడడంతో పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

టిడ్కో గృహాలపై ఎల్లో మీడియా విషప్రచారం

మంత్రి ఆదిమూలపు వెల్లడి

నరసరావుపేట: రాష్ట్రంలోని తమ ప్రభుత్వం 55వేల పైచిలుకు టిడ్కో గృహాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తుంటే ఎల్లో మీడియా విషప్రచారం చేస్తోందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ విమర్శించారు. బుధవారం నరసరావుపేటలో టిడ్కో గృహసముదాయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నరసరావుపేటలో కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సారథ్యంలో పూర్తిచేసిన 1,504 గృహాలను ప్రారంభించుకోవటం ఆనదంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 55వేల పైచిలుకు గృహాలను అన్ని వసతులూ సమకూర్చి అందజేస్తున్నట్లు వివరించారు. కాని ఇది ప్రతిపక్షాలు, ఎల్లో మీడియాకు కనపడదని ఎద్దేవా చేశారు. పేదలకు ఇళ్లు దక్కకూడదన్న అక్కసుతో ప్రతిపక్షాలు కోర్టు కేసులతో ఎందుకు అడ్డు తగులుతున్నాయంటూ ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీని కొన్నిపత్రికలు, మీడియా సంస్థలు భుజాన ఎత్తుకొని కోర్టులో కేసులు వేసిన విషయం ప్రస్తావించకుండా టిడ్కో గృహాలు ఇవ్వట్లేదని ప్రచారం చేస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. తాము ఎప్పుడో పూర్తిచేశామనే టీడీపీ నేతలు ఎందుకు లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో లబ్ధిపొందాలనే దుర్బుద్ధితో వసతులు కల్పించకుండానే టిడ్కో గృహాలకు ప్రారంభోత్సవాలు చేశారని పేర్కొన్నారు. టీడీపీ నేతల్లా లబ్ధిదారుల నుంచి డబ్బులు లాక్కునే కార్యక్రమాలేమీ తాము చేయలేదని, ఉచితంగా ఒక్క రూపాయికే ఇళ్లు ఇచ్చామని ఆదిమూలపు స్పష్టం చేశారు. ఈఏడాది చివరినాటికి రాష్ట్రవ్యాప్తంగా 2.63లక్షల ఇళ్లను పూర్తి హంగులతో అందజేస్తామని మంత్రి ఆదిమూలపు వెల్లడించారు.

రూ.14 కోట్లతో మౌలిక వసతులు కల్పించాం

ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ రూ.14 కోట్లతో మౌలిక వసతులు కల్పించి టిడ్కో ఇళ్లు అందజేస్తున్నా మని పేర్కొన్నారు. ప్రక్రియను కోర్టుకు వెళ్లి ఆపాలనే యత్నిస్తున్నారని, అన్నీ అధిగమించి ముందుకెళతామన్నారు. మెయిన్ రోడ్డు నుంచి టిడ్కో గృహాల వరకు సీసీ రోడ్డు, మధ్యలో కల్వర్టు నిర్మించామన్నారు.

పశ్చిమ డెల్టాలో త్వరలో కాల్వల మరమ్మతులు

కృష్ణాపశ్చిమ డివిజన్ ఈఈ మల్లికార్జున

తెనాలి: కృష్ణాపశ్చిమ డెల్టాలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) పనులు కొద్దిరోజుల్లో ప్రారంభమవుతాయని కృష్ణాపశ్చిమ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు మల్లికార్జున తెలిపారు. ఓ అండ్ ఎం ద్వారా డివిజన్‌లో మొత్తం 99 పనులను గుర్తించినట్టు వివరించారు. ఇందుకోసం రూ.6.80 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు. ప్రస్తుతం టెండర్లు పిలిచామని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. కృష్ణాపశ్చిమ డెల్టా పరిధిలో 5.71 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నట్టు వివరించారు. గతంలో ఈ ఆయకట్టు తెనాలి డివిజన్ పరిధిలోనే ఉండేదని, ప్రస్తుతం కొత్త జిల్లాల ఏర్పాటుతో మూడు జిల్లాల పరిధిలోకి వెళ్లిందని పేర్కొన్నారు. గుంటూరు జిల్లాలో 1.84 లక్షల ఎకరాలు, బాపట్ల జిల్లాలో 3.79 లక్షల ఎకరాలు ఉండగా, ప్రకాశం జిల్లాలో మరో ఏడు వేల ఎకరాల ఆయకట్టు ఉందని వివరించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



సైబర్ మోసాలపై అవగాహన పోస్టర్‌ను విడుదల

బాపట్ల టౌన్: సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ కోరారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరులతో బుధవారం మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు వాట్సాప్‌ను తమ మోసానికి వారధిగా వాడుకుంటున్నారని, ఇటీవల కాలంలో చాలా మందికి తెలియని నంబర్ల నుంచి వాట్సాప్ కాల్స్ వస్తున్నాయని, అవికూడా ఇతర దేశాలకు చెందిన కోడ్‌తో వస్తున్నాయన్నారు. సైబర్ నేరగాళ్లు కొంత మంది యూజర్లను టార్గెట్ చేసుకొని ఈ ఫేక్ కాల్స్ చేస్తున్నారు. వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రోటోకాల్ నెంబర్‌ను కొనుగోలు చేయడం ద్వారా ఇతర దేశాల నుంచి ఫోన్ వస్తున్నట్లు భ్రమ కలిగిస్తున్నారన్నారు. ఇలా ఫోన్ కాల్స్ చేసి వర్క్ ఫ్రమ్ హోమ్ పని ఉందంటూ వినియోగదారులను మోసం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కేవలం వెబ్‌సైట్స్ క్లిక్ చేస్తే డబ్బులు వస్తాయంటూ ఆశ చూపుతూ యూజర్లను నిండా ముంచుతున్నారని చెప్పారు. అంతర్జాతీయ నంబర్ల నుంచి వచ్చే స్కామ్ కాల్స్ ద్వారా హ్యాకర్స్ యూజర్ల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించేందుకు పలు రకాల టెక్నాలజీలను ఉపయోగిస్తున్నారని హెచ్చరించారు. సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఖోఖో పోటీల్లో ప్రకాశం జట్టుకు ద్వితీయ స్థానం


ద్వితీయ స్థానం సాధించిన ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

జె.పంగులూరు: రాష్ట్ర స్థాయి ఖోఖో అండర్–19 బాలుర విభాగం పోటీల్లో ప్రకాశం జిల్లా జట్టు సత్తా చాటింది. ఈ నెల 21నుంచి 23వ తేదీ వరకు పోటీలు విజయనగరంలో నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర జట్టు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. ఈ జట్టులో 12 మంది బాలురు ఉమ్మడి ప్రకాశం జిల్లా జె.పంగులూరు మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు కావటం విశేషం. ఈ సందర్భంగా బాలుర జట్టును ఇంటర్మీడియెట్ బోర్డు ఆర్‌ఐఓ సైమన్, స్కూల్ గేమ్ అండర్–19 సెక్రటరీ ఆదినారాయణ, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచు గరటయ్య, శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య, మాగుంట కళాశాల చైర్మన్ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, కోచ్ మేకల సీతారామిరెడ్డి బుధవారం అభినందించారు. ఒకే కళాశాల నుంచి 12 మంది క్రీడాకారులు ఎంపిక కావడం గర్వంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ సాదిన రమేష్ అన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్ని అత్యంత ప్రతిభను కనపరిచిన ముగ్గురు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఎంపికైన క్రీడాకారులు జూన్ నెల 6 నుంచి 10వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి అండర్–19 స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీల్లో పాల్గొంటారని మేకల సీతారామిరెడ్డి తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు కంచెర్ల వెంకట్రావు, పొన్నగంటి గోపి, జనమాల విజయ్‌కుమార్ ఎంపికయ్యారు.

రేపు వేర్వేరు మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపు

వెంకటపాలేనికి సీఎం వైఎస్ జగన్ రాక

నగరంపాలెం: తుళ్లూరు మండలం వెంకటపాలెంలో ఈనెల 26న పేదలకు ఉచితంగా ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతున్న దృష్ట్యా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరణకు ట్రాఫిక్ మళ్లించినట్లు గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది.

- 26 తెల్లవారుజామున 4 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపు అమలు ఉంటుంది. భారీ వాహనాల హోల్డింగ్ పాయింట్ల ఇలా..
- చెన్నై వైపు నుంచి విజయవాడ మీదుగా విశాఖపట్నం వైపు ఇబ్రహీంపట్నం, నందిగామ వైపునకు వెళ్లే భారీ గూడ్స్ వాహనాలు ఒంగోలు జిల్లా త్రోవగుంట వద్ద నుంచి చీరాల– బాపట్ల –రేపల్లె– అవనిగడ్డ– పామర్రు – గుడివాడ – హనుమాన్ జంక్షన్ మీదుగా విశాఖపట్నం/ ఇబ్రహీంపట్నం వైపునకు మళ్లించారు.
- చెన్నై నుంచి హైదరాబాద్‌వైపు వెళ్లే వాహనాలు మేదరమెట్ల, అద్దంకి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, నార్కెట్‌పల్లి మీదుగా హైదరాబాద్ వెళ్లాలి.
- చిలకలూరిపేట నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలను చిలకలూరిపేట నుంచి ఎన్‌హెచ్– 16 మీదగా పెదనందిపాడు, కాకుమాను, పొన్నూరు, చందోలు, చెరుకుపల్లి , భట్టిప్రోలు, పెనుమూడి బ్రిడ్జి మీదుగా అవనిగడ్డ, పామర్రు – గుడివాడ – హనుమాన్ జంక్షన్ మీదుగా విశాఖపట్నం వైపు మళ్లించారు.
- చెన్నై నుంచి విశాఖపట్నం వెళ్లే వాహనాలను బోయపాలెం క్రాస్ వద్ద నుంచి ఉన్నం గ్రామం, ఏ.బి.పాలెం వల్లూరు, పాంచ్రపాడు, పొన్నూరు ,చందోలు, చెరుకుపల్లి, భట్టిప్రోలు, పెనుమూడి బ్రిడ్జి మీదగా అవనిగడ్డ, పామర్రు– గుడివాడ – హనుమాన్ జంక్షన్ మీదుగా విశాఖపట్నం వైపు వెళ్లాలి.
- గుంటూరు నుంచి విశాఖపట్నం వెళ్లే వాహనాలను బుడంపాడు మీదుగా తెనాలి, వేమూరు, కొల్లూరు, వెల్లటూరు జంక్షన్, పెనుమూడి బ్రిడ్జి మీదగా అవనిగడ్డ, పామర్రు–గుడివాడ హనుమాన్ జంక్షన్ మీదుగా విశాఖపట్నం వైపు మళ్లించారు.
- విశాఖపట్నం వైపు నుంచి చెన్నై వైపు వెళ్లే లారీలు, భారీ వాహనాలు హనుమాన్ జంక్షన్ వద్ద నుంచి గుడివాడ – పామర్రు– అవనిగడ్డ– రేపల్లె– బాపట్ల – చీరాల– త్రోవగుంట– ఒంగోలు మీదుగా మళ్లించారు.
- రాజమండ్రి నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు దివాన్ చెరువు, ధవళేశ్వరం బ్రిడ్జి, కొవ్వూరు, జంగారెడ్డిగూడెం, అశ్వారావు పేట, సత్తుపల్లి మీదుగా మళ్లించారు.
- విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే లారీలు, భారీ వాహనాలు హనుమాన్ జంక్షన్ వద్ద నుంచి నూజివీడు– మైలవరం– జి కొండూరు, ఇబ్రహీంపట్నం వైపు మళ్ళించారు.
- గన్నవరం వైపు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కేసరపల్లి, ముస్తాబాద్, ఇన్నర్ రింగ్‌రోడ్, పైపులరోడ్, ఇబ్రహీంపట్నం వైపునకు మళ్ళించారు.
- హనుమాన్ జంక్షన్ వైపు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు గన్నవరం గాంధీ బొమ్మ, ఆగిరిపల్లి, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం వైపు మీదుగా వెళ్లాలి.
- భారీ సరుకు రవాణా వాహనాలను గన్నవరం, ఆగిరిపల్లి, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం వైపునకు మళ్లించారు.
- హైదరాబాద్ వైపు నుంచి చెన్నై వైపు వెళ్లే వాహనాలను నార్కెట్‌పల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ళ, అద్దంకి, మేదరమెట్ల మీదుగా చెన్నై వెవెళ్లాలి.
- హైదరాబాద్ వైపు నుంచి విశాఖపట్నం వెళ్లే లారీలు, భారీ వాహనాలు ఇబ్రహీంపట్నం వద్ద నుంచి జి.కొండూరు– మైలవరం– నూజివీడు –హనుమాన్ జంక్షన్ వద్ద నుంచి అనుమతిస్తారు.
- చెన్నై వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే మల్టీ–ఎక్సెల్ గూడ్స్ వాహనాలను ఎటువంటి మళ్లింపు లేకుండా జాతీయ రహదారికి సమీపంలోని చిలకలూరిపేట, ఒంగోలు, నెల్లూరు వద్ద నిలిపివేయనున్నారు. వాటిని సాయంత్రం 4 గంటల తరువాత అనుమతిస్తారు.
- విశాఖపట్నం వైపు నుంచి చెన్నై వైపు వెళ్లే మల్టీ– ఎక్సెల్ గూడ్స్ వాహనాలను హనుమాన్ జంక్షన్ వద్ద, పొట్టిపాటు టోల్ గేట్ వద్ద జాతీయ రహదారికి సమీపంలో నిలిపివేస్తారు. వాటిని కూడా సాయంత్రం 4 గంటలు తరువాత అనుమతిస్తారు.

పెదకాకాని నుంచి వెంకటపాలెం వచ్చే వాహనాల పార్కింగ్ ప్రదేశం వివరాలివే

- తక్కెళ్లపాడు, ఉప్పలపాడు, నంబూరు, అగతరప్పాడు, తక్కెళ్లపాడు వైపు నుంచి వచ్చే వాహనాలు కొప్పురావూరు నుంచి కంతేరు, తాడికొండ, పెదపరిమి, తుళ్లూరు రాయపూడి సీడ్ యాక్సిస్ రోడ్డుకు రావల్సి ఉంది.
- మంగళగిరి టౌన్, కాజా, ఆత్మకూరు, పెదవడ్లపూడి వైపు నుంచి వచ్చే వాహనాలు నిడమర్రు, కురకల్లు, వీఐటీ కాలేజీ జంక్షన్, అసెంబ్లీ వెనుక నుంచి వెలగపూడి చర్చ్ సెంటర్ మీదుగా సీడ్ యాక్సిస్ వైపునకు రావల్సి ఉంటుంది.
- తాడేపల్లి నుంచి వచ్చే వాహనాలు ఎయిమ్స్ ఆస్పత్రి లోపల నుంచి మంగళగిరి బ్రిడ్జి, డాన్‌బాస్కో స్కూల్, ఎర్రబాలెం, కృష్ణాయపాలెం, మందడం మీదుగా వెలగపూడి చర్చి దగ్గర కుడివైపునకు తీసుకొని సీడ్ యాక్సిస్ ఎస్ 9 జంక్షన్‌కు వచ్చి సీడ్ యాక్సిస్ రోడ్డు వైపునకు రావల్సి ఉంది.
- విజయవాడ వైపు నుంచి వచ్చే వాహనాలు ఉండవల్లి, ఉండవల్లి కేవ్స్, పెనుమాక మీదుగా కృష్ణాయపాలెం దాటిన తరువాత కుడి వైపు మెటల్ రోడ్‌లోకి వెళ్లి వెంకటపాలెం పార్కింగ్ ప్రదేశంలోకి చేరాల్సి ఉంటుంది.
- విజయవాడ వైపు నుంచి వచ్చే వాహనాలు విజయవాడ ఎయిమ్స్ పక్కగా బ్రహ్మానందపురం రైల్వే గేటు, నులకపేట మీదుగా ఉండవల్లి సెంటర్, ఉండవల్లి గృహాలు, పెనుమాక, కృష్ణయ్యపాలెం దాటాక కుడివైపునకు తీసుకొని వెంకటపాలెం వాహనాల నిలుపుదల ప్రదేశానికి రావల్సి ఉంటుంది.

టీవీల దొంగ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ జి.వేణుగోపాలరెడ్డి

బాపట్ల టౌన్: రిసార్ట్స్‌లో పనిచేస్తూ రిసార్ట్స్‌లోని టీవీ దొంగిలించిన దొంగను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. బాపట్ల సర్కిల్ కార్యాలయంలో సీఐ జి.వేణుగోపాలరెడ్డి వివరాలుల్లడించారు. ఈనెల19న బాపట్ల మండలం, అడవిపల్లిపాలెం గ్రామంలోని వి హోటల్‌లో 40 అంగుళాల సైజ్ కలిగిన 8 టీవీఅపహరణకు గురయ్యాయంటూ హోటల్ మేనేజర్ డోల కిరణ్‌కుమార్ ఫిర్యాదుచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రూరల్ ఎస్ఐ కె.వెంకటప్రసాద్, విచారించగా హోటల్ హౌస్ కీపింగ్ వర్క్ చేసే పుట్ట ప్రవీణ్ కుమార్ టీవీలను దొంగిలించినట్లు నిర్ధారించారు. నిందితుడి ఇంటి వద్ద ఉన్న 8 టీవీలతోపాటు పల్సర్ బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని నిందితుడి కోర్టుకు హాజరుపరిచారు.

వేటలో నైపుణ్యం సాధించాలి

చీరాల అర్బన్: గంగ పుత్రులు వేట చేసే సమయంలో నైపుణ్యం ప్రదర్శిస్తే ఆర్థికాభివృద్ధి చెందుతారని కేంద్ర మత్స్యకార ఇంజినీరింగ్ ట్రైనింగ్ సెంటర్ ప్రతినిధులు డాక్టర్ బాలు, ఎం.దీపక్ సుషాంత్ సూచించారు. చీరాల రూరల్ మండలం వాడరేవులోని మత్స్యకారులకు సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ నాటికల్ అండ్ ఇంజినీరింగ్ ట్రైనింగ్‌ను బుధవారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు శిక్షణనివ్వనున్నారు. శిక్షణలో శుభ్రతతో కూడిన చేపలు పట్టడం, నిల్వ చేయడం విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మత్స్యశాఖాభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బాలికను మోసగించిన యువకుడి అరెస్ట్

అద్దంకి రూరల్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ రోశయ్య తెలిపిన వివరాలు.. అద్దంకి పట్టణానికి చెందిన యువకుడు తనకు పరిచయం ఉన్న బాలికను మాయమాటలతో లొంగతీసుకుని లైంగిక దాడి చేస్తున్నాడు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు కోచింగ్‌కు వెళ్లి స్నేహితులతో కలసి వస్తుండగా అద్దంకి సమీపంలోని బొమ్మనంపాడు రోడ్డులోని సుబాబుల్ తోటలోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడినట్లు బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కోచింగ్ నుంచి ఇంత ఆలస్యం ఎందుకు అయిందని తల్లిదండ్రులు నిలదీయడంతో విషయం బయటపడినట్లు వివరించారు. బాలిక ఫిర్యాదు మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

వేధిస్తున్నాడని.. ఇంటివారే కొట్టి చంపారు!

ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

గుంటూరురూరల్: మద్యానికి బానిసై డబ్బుల కోసం వేధిస్తున్న యువకుడిని కుటుంబ సభ్యులే హతమార్చిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గుంటూరు రూరల్ మండలం అడవితక్కెళ్లపాడులోని నల్లపాడు పోలీస్ స్టేషనులో సీఐ శ్రీనివాసరావు కేసు వివరాలను వెల్లిడించారు. గుంటూరు రూరల్ మండలం స్వర్ణభారతి నగర్‌కు చెందిన షేక్ ఫరీద్ (18) మద్యానికి బానిసై డబ్బులు ఇవ్వమని తల్లి, తాతయ్య, అమ్మమ్మలను వేధించడంతో పాటు అడ్డువెళ్లిన వారిపై కూడా విరుచుకుపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 21వ తేదీ రాత్రి పది గంటల సమయంలో ఫరీద్ డబ్బుల కోసం తల్లి, తాతయ్య, అమ్మమ్మలను విపరీతంగా ఇబ్బంది పెట్టాడు. దీంతో భయాందోళనకు గురైన వారు, స్వర్ణభారతి నగర్ పదిహేనవ లైనులో నివాసం ఉంటున్న చిన్నకుమార్తె ఇంటికి వెళ్లారు. ఫరీద్ అక్కడికి కూడా వెళ్లి నానాయాగీ చేశాడు. దీంతో కుటుంబ సభ్యులైన కారు డ్రైవర్ షేక్ సుభాని, కార్పెంటర్ మహమ్మద్ సల్మాన్‌లు ఫరీద్ గొడవ రోజురోజుకీ ఎక్కువవుతోందని, అతనిని చంపాలని పథక రచన చేశారు. అర్ధరాత్రి సమీపంలో ఫరీద్ ఇంట్లో మద్యం మత్తులో నిద్రిస్తున్న సమయంలో మెడకు నవారు తాడు చుట్టి గట్టిగా బిగించారు. పక్కనే ఉన్న కర్ర తీసుకుని ఫరీద్‌ను సుభాని, సల్మాన్‌లు కొట్టి చంపినట్లు విచారణలో తేలింది. ఈ మేరకు నల్లపాడు సీఐ బత్తుల శ్రీనివాసరావు బుధవారం ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు.

నిబంధనల ప్రకారమే బదిలీలు, పదోన్నతులు

ఉపాధ్యాయ సంఘాలు సహకరించాలి


మాట్లాడుతున్న పాఠశాల విద్య సంయుక్త సంచాలకులు సుబ్బారావు

నగరంపాలెం: ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా జరుగుతాయని, ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలు సహకరించాలని పాఠశాల విద్య సంయుక్త సంచాలకులు వీఎస్.సుబ్బారావు అన్నారు. గుంటూరు పాతబస్టాండ్ సమీపంలోని పరీక్షా భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉన్నట్‌లైతే డీఈఓకు, తమ పరిధిలో పరిష్కారం కాని సమస్యలను ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఉపాధ్యాయ సంఘాలు తీసుకువచ్చిన సమస్యలను తాము పరిష్కరిస్తామని చెప్పారు. డీఈఓ పి.శైలజ మాట్లాడుతూ సీనియారిటీ జాబితాలో ఏవైనా తప్పులు దొర్లితే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఐదేళ్లు పూర్తయిన ప్రధానోపాధ్యాయులు, ఎనిమిదేళ్లు పూర్తయిన స్కూల్ అసిస్టెంట్‌లు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, బదిలీ కావల్సిన ఉపాధ్యాయులు సంబంధిత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధంగా కృషి చేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని డీడీఓలు అందరూ ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండాలని చెప్పారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు యిచ్చిన వినతులను పరిష్కరిస్తామని హామీయిచ్చారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి కె.సుధాకర్‌రెడ్డి, ఉర్దూ ఉప తనిఖీ అధికారి ఎండీ.ఖాసీం, ఎ.ఎస్.ఓ. వి.నాగ మల్లేశ్వరరావు, ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వాళ్లంతా ఒక్కటయ్యారు!


కఠారివారిపాలెంలో మత్స్యకార పెద్దకాపులతో సమావేశం

- మత్స్యకారుల సమస్య కొలిక్కి
- పోలీస్ పికెట్ కొనసాగింపు

వేటపాలెం: మండల పరిధిలోని రామాపురం మత్స్యకారులకు చెందిన రెండు వర్గాల వివాదం కొలిక్కి వచ్చింది. బుధవారం కఠారివారిపాలెంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా మత్స్యకారుల గ్రామాల పెద్దలతో ఏర్పాటు చేసిన సమావేశంలో రాజీ కుదిరింది. ఆరు నెలలుగా రామాపురంలోని రెండు వర్గాల మధ్య జరుగుతున్న వివాదం తెలిసిందే. ఎట్టకేలకు రాష్ట్ర మత్స్యకార కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ అనిల్‌కుమార్ సమక్షంలో మత్స్యకార పెద్దల సమక్షంలో పరిష్కరించారు.

ఏం జరిగిందంటే..

ఆరు నెలల క్రితం రామాపురం మత్స్యకార గ్రామానికి చెందిన పామంజి శేషగిరి.. గ్రామానికి చెందిన మరో కుటుంబంపై చేత బడి చేశారనే అనుమానంతో కొంత మంది గ్రామస్తులు అతడిని కొట్టి నిర్బంధించారు. దీనిపై అప్పటిలో పోలీసులు జోక్యం చేసు కొని ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి పరిస్థితి చక్కదిద్దారు. అయితే అనంతరం తరచూ గ్రామంలోని రెండు వర్గాలకు ఘర్షణలు జరుగుతున్నాయి. దీంతో చేతబడి ఆరోపణలు ఎదుర్కొంటున్న వర్గానికి చెందిన దాదాపు వంద కుటుంబాలు గ్రామం విడిచి పక్కనే ఉన్న మరో మత్స్యకార గ్రామం కఠారి వారిపాలెం వలస వచ్చి ఊరు చివర టెంట్‌లు వేసుకొని ఆరు నెలలుగా ఉంటున్నారు. తమకు జరిగిన అన్యాయాన్ని పరిశీలించి న్యాయం చేయాలని కోరుతూ బాధితులు ఉమ్మడి ప్రకాశం జిల్లా మత్స్యకార గ్రామాల పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 20వ తేదీన కఠారివారిపాలెంలో మత్స్యకార పెద్ద కాపులు వచ్చి కఠారివారిపాలెంలో సమావేశం ఏర్పాటు చేశారు. కాగా కొద్దిపాటి ఘర్షణలో రామాపురానికి చెందిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో సమావేశాన్ని అప్పటిలో పెద్దకాపులు వాయిదా వేశారు. తిరిగి బుధవారం పెద్దల సమావేశం ఏర్పాటు చేసి ఇరు వార్గలకు రాజీ కుదిర్చారు.

ఊపిరి పీల్చుకున్న పోలీసులు

కఠారివారిపాలెంలో ఉంటున్న వంద కుటుంబాలు రెండు రోజుల్లో వారి స్వగ్రామం రామాపురానికి తిరిగి వెళ్లనున్నాయి. సమస్య పరిష్కారం కావడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి దాదాపు వంద మంది పోలీసులు రెండు మత్స్యకార గ్రామాల్లో పికెట్, బందోబస్తు నిర్వహిస్తున్నారు. అయితే ప్రశాంత వాతావరణం ఏర్పడే వరకు మరి కొన్ని రోజుల పాటు పోలీస్ పికెట్ కొనసాగిస్తున్నట్లు బాపట్ల డీఎస్పీ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ జి.సురేష్ తెలిపారు.

రేపటి నుంచి జాతీయ స్థాయి నాటిక పోటీలు


మాట్లాడుతున్న కళాపరిషత్ కార్యదర్శి సాయిబాబు

పర్చూరు(చినగంజాం): మండలంలోని వీరన్నపాలెంలో ఈ నెల 26 నుంచి నాలుగు రోజులపాటు జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు కళానికేతన్ కళాపరిషత్ కార్యదర్శి చిట్టినేని సాయిబాబు తెలిపారు. కళాపరిషత్ భవనంలో బుధవారం కమిటీ సభ్యుల సమావేశం అనంతరం వివరాలు వెల్లడించారు. నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఎన్టీఆర్ గార్డెన్ సెంటర్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక ప్రదర్శనలుగా 3 నాటికలను తీసుకోవటం జరిగిందన్నారు. ఈ పోటీల్లో ప్రదర్శించిన ప్రతి నాటికకు ప్రదర్శనా పారితోషికం రూ.20 వేలు, దర్శకునికి రూ.1000, రచయితకు రూ.1000గా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా వరసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో కొల్లా శ్రీనివాసరావు, గోరంట్ల రాంబాబు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, యార్లగడ్డ రామకృష్ణ పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చిన ఘనత జగనన్నదే

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)
- కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డితో కలసి కృష్ణాయపాలెం లే అవుట్ పరిశీలన


కృష్ణాయపాలెం లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: పేదవాడు గొప్పవాడు కావాలని, ఇళ్లులేని ఏ ఒక్క పేదవాడు ఉండకూడదని మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో పేదలకు 25 లక్షల ఇళ్లను నిర్మిస్తే నేడు ఆయన తనయుడు, సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 33 లక్షల గృహాలను నిర్మించడం ఎంతో గొప్ప విషయమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. సీఆర్‌డీఏ పరిధిలోని కృష్ణాయపాలెం లేఅవుట్‌లో పూర్తయిన అభివృద్ధి పనులను బుధవారం ఎమ్మెల్యే ఆర్కే జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ దశాబ్దాల నాటి పేదల కల తీర్చిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని, 1450 ఎకరాల్లో 55 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం ఎంతో గొప్ప విషయమన్నారు. అందులో భాగంగా మంగళగిరి నియోజకవర్గానికి సంబంధించి సుమారు 650 ఎకరాల్లో 23 వేల మంది స్థానిక పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. పేదవారు, తక్కువ కులం వారు రాజధాని ప్రాంతంలో ఉండకూడదనే దురుద్దేశ్యంతో చంద్రబాబు రైతుల పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, తన బినామీలతో కోర్టుల్లో అన్యాయంగా వ్యాజ్యాలు వేయించారని గుర్తు చేశారు. చంద్రబాబు ఎక్కడైతే పేదవాడు ఉండకూడదని కోరుకున్నాడో అక్కడే ఆ దేవుడు, గౌరవ న్యాయస్థానాలు, సీఎం జగన్ మోహన్‌రెడ్డి కోరికతో పాటు పేదవాడి కల తీరేవిధంగా ఇళ్ల పట్టాలను కేటాయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నగర కమిషనర్ యు.శారదాదేవి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ పాల్గొన్నారు.